నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
06.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna

**గూగుల్ జెమిని**

చాట్‌జీపీటీకి పోటీగా గూగుల్ కొత్తగా 'గూగుల్ జెమిని' పేరుతో అడ్వాన్స్‌డ్ ఏఐ మోడల్ చాట్‌బాట్‌ను తీసుకొచ్చినట్లు గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ డిసెంబర్ 18న వెల్లడించారు. ఇది టెక్ట్స్, ఫొటో, ఆడియో, వీడియో, కోడింగ్ తదితర అంశాలపై యూజర్లకు 90 శాతం కచ్చితత్వంతో సమాధానాలు అందిస్తుందని పేర్కొన్నారు. జెమిని 1.0 వెర్షన్‌లో జెమిని అల్ట్రా, జెమిని ప్రో, జెమిని నానో అనే మూడు వేరియంట్లను తీసుకొచ్చారు.

nipuna
Every Wednesday Free Supplement
31 జనవరి 2024
పేజీలు 8

3వ పేజీ తరువాయి

**బడ్జెట్ రకాలు**

- లోటు బడ్జెట్‌లో ఉన్న లోటును పూరించడానికి ప్రభుత్వం అనుసరించే మార్గాలు..
  1) అదనపు పన్నులను విధించడం (సర్‌చార్జీలు, సెస్ విధించడం, పన్ను రేట్లు పెంచడం)
  2) కొత్తపన్నులను విధించడం
  3) అదనపు రుణ సేకరణ చేయడం
  4) కొత్తగా ద్రవ్యాన్ని ముద్రించి ఖర్చు చేయడం

**సాధారణ బడ్జెట్**
(General/ Annual budget)

- సాధారణంగా ప్రభుత్వం ఒక ఆర్థిక సంవత్సరానికి (ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు అంటే 12 నెలలకు) రూపొందిస్తారు. ఇలాంటి బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్ అంటారు. – దేశంలో ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1న ప్రారంభమై మార్చి 31న ముగుస్తుంది.

**తాత్కాలిక బడ్జెట్**

- రాజకీయ అస్థిరత, యుద్ధం, ప్రకృతి వైపరీత్యాలు మొదలైనవి సంభవించినప్పుడు సంవత్సర కాలం కంటే తక్కువ వ్యవధికి బడ్జెట్‌ను రూపొందిస్తారు. ఇలాంటి బడ్జెట్‌ను తాత్కాలిక బడ్జెట్' అంటారు.
- తాత్కాలిక బడ్జెట్‌లో వ్యయానికి సంబంధించిన వివరాలు ఉంటే చాలు. రాబడికి సంబంధించిన వివరాలు తప్పనిసరి కాదు.

**సామర్థ్య ఆధారిత బడ్జెట్/ పర్ఫామెన్స్ బడ్జెట్**

- వివిధ రంగాల కేటాయింపులతో పాటు కచ్చితమైన ఫలితాలను వివరిస్తూ రూపొందించిన బడ్జెట్‌ను పర్ఫామెన్స్ బడ్జెట్ అంటారు. ఈ రకమైన బడ్జెట్‌ను హూవర్ కమిషన్ సిఫారసు చేయగా అమెరికాలో తొలిసారి 1962లో ప్రవేశ పెట్టారు.
- శాఖల పనితీరు, సామర్థ్యం, పథకాల ఆధారంగా కేటాయింపులు జరిపి వ్యయం చేసే దాన్ని సామర్థ్య ఆధారిత బడ్జెట్ అంటారు. పరిపాలన సంస్కరణల సంఘం సిఫారసుల మేరకు 1968లో కొన్ని శాఖల్లో దీన్ని ప్రవేశపెట్టారు.

**ఔట్‌కమ్ బడ్జెట్** (Outcome Budget)

- అప్పటికే సాధించిన లక్ష్యాలను వదిలేసి, నిధుల కేటాయింపు, సాధించాల్సిన లక్ష్యాలను వివరిస్తూ రూపొందించిన బడ్జెను ఔట్ కమ్ బడ్జెట్ అంటారు. 2005–06కు అప్పటి ఆర్థిక మంత్రి చిదంబరం తొలిసారి ఔట్‌కమ్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు.

**మధ్యంతర బడ్జెట్**

- మధ్యంతర బడ్జెట్‌లో వ్యయం వివరాలు, రాబడి వివరాలు తప్పనిసరి.

**సంతులిత బడ్జెట్** (Balanced budget)

- ప్రభుత్వానికి వచ్చే ఆదాయాలు, వ్యయాలు సమానంగా ఉండే ఆర్థిక నివేదికను సంతులిత బడ్జెట్ అంటారు. ఇందులో మిగులు లేదా లోటు ఉండదు. దీన్నే సమతౌల్య బడ్జెట్ అంటారు.

**అసంతులిత బడ్జెట్** (Unbalanced budget)

- ఆదాయ, వ్యయాలు సమానంగా లేని బడ్జెట్‌ను అసంతులిత బడ్జెట్ అంటారు. ఈ బడ్జెట్‌లో మిగులు లేదా లోటు ఉండవచ్చు.

**ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్**
(Vote on Account budget)

- బడ్జెట్‌లోని వివిధ పద్దులను పరిశీలించి ఆమోదించడానికి కొంత వ్యవధి అవసరం. కాబట్టి ప్రభుత్వం గ్రాంట్లను ముందుగా పొందే అవకాశాన్ని ఓట్ ఆన్ అకౌంట్ అంటారు లేదా ఎలాంటి చర్చ లేకుండా లోక్‌సభ ఆమోదించే బడ్జెట్‌ను ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ అంటారు. ప్రభుత్వం తమ వ్యయాలను కొంత కాలానికి మాత్రమే కొనసాగించడానికి రూపొందించే బడ్జెట్. ఇందులో వ్యయానికి ప్రాధాన్యం ఇస్తారు.



**శూన్య ఆధారిత బడ్జెట్**
(Zero based budget)

- గతాన్ని పూర్తిగా విస్మరించి వర్తమాన అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రస్తుత ఆవశ్యకత బట్టి రూపొందించే బడ్జెట్‌ను శూన్య ఆధారిత బడ్జెట్ అంటారు.
- జీరో బేస్డ్ బడ్జెట్‌ను తొలిసారి 1969లో అమెరికాకు చెందిన పీటర్ ఫైర్ రూపొందించారు. ఇన్‌స్ట్రుమెంట్స్ అనే ఒక ప్రైవేటు కంపెనీలో ఉపయోగించారు.
- జీరో బేస్డ్ బడ్జెట్‌లో ప్రస్తుత సమస్యలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది.
- ఈ బడ్జెట్‌లో ఒక పథకం లేదా అంశం ప్రస్తుత ఆవశ్యకతను బట్టి కొత్తగా ఆలోచించి మొట్టమొదటగా అంచనా వేసి నిధులను కేటాయిస్తారు.
- జీరో బేస్డ్ బడ్జెట్ అనే పదం మొదటిసారి 1928లో ప్రచురించారు.
- ఈ బడ్జెట్‌ను ప్రపంచంలో తొలిసారి 1977లో అమలు చేసింది– యూఎస్ఏ ప్రభుత్వం (జార్జియా రాష్ట్ర బడ్జెట్)
- భారత్‌లో ఈ బడ్జెట్ గురించి మొదటిసారి ప్రస్తావించింది– సంజయ్‌గాంధీ
- దేశంలో అధికారికంగా పార్లమెంట్‌లో ఈ బడ్జెట్ గురించి మొదట ప్రస్తావించింది– 1986లో వీపీ సింగ్ (రాజీవ్‌గాంధీ కాలంలో)
- కేంద్ర ప్రభుత్వం 1986–87లో, 1990–91లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నపూర్వకంగా ఈ బడ్జెట్‌ను అమలు చేశారు. కానీ ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ బడ్జెట్‌ను కొనసాగించడం లేదు.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ బడ్జెట్‌ను 2001లో యనమల రామకృష్ణుడు ప్రవేశపెట్టారు
- జీరో బేస్డ్ బడ్జెట్‌ను తొలిసారి ప్రవేశ పెట్టింది– మహారాష్ట్ర ప్రభుత్వం

**అనుబంధ బడ్జెట్**
(Supplementary budget)

- ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాలు లాంటి అత్యవసర సమయంలో అత్యవసర సమయాల్లో ప్రధాన బడ్జెట్‌ను కాకుండా అనుబంధ బడ్జెట్‌ను రూపొందిస్తారు.

**బహుళ బడ్జెట్** (Multiple budget)

- ఒకే సంవత్సరంలో రెండు లేదా అంతకంటే ఎక్కువ రకాల బడ్జెట్లను రూపొందిస్తే దాన్ని బహుళ బడ్జెట్ అంటారు. **ఉదా:** గతంలో ఒక ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్, రైల్వే బడ్జెట్ ఉదాహరణలు. దేశంలో బహుళ బడ్జెట్‌లు 1924 నుంచి 2017 వరకు అమల్లో ఉంది. కొన్ని రాష్ట్రాల్లో రాష్ట్ర బడ్జెట్‌తో పాటు ప్రత్యేకంగా వ్యవసాయ బడ్జెట్ ఉంటుంది.

**రెవెన్యూ బడ్జెట్** (Revenue budget)

- రెవెన్యూ, ఆదాయ వ్యయాలతో కూడిన బడ్జెట్‌ను రెవెన్యూ బడ్జెట్ అంటారు. రెవెన్యూ ఆదాయాన్ని పన్ను ఆదాయం, పన్నేతర ఆదాయాలుగా విభజిస్తారు. రెవెన్యూ వ్యయాన్ని ప్రణాళిక వ్యయం, ప్రణాళికేతర వ్యయాలుగా విభజించవచ్చు.

**మూలధన బడ్జెట్** (Capital budget)

- మూలధన ఆదాయం, మూలధన వ్యయాలతో కూడిన బడ్జెట్‌ను మూలధన బడ్జెట్ అంటారు.

**స్థిర బడ్జెట్** (Fixed budget)

- బడ్జెట్‌ను అమలు చేసే కాలంలో మార్పు లేకుండా స్థిరంగా ఉంచుతూ రూపొందించడాన్ని స్థిర లక్షణ బడ్జెట్ అంటారు.

**చర బడ్జెట్** (Flexible budget)

- అభివృద్ధి దశల్లో వచ్చే మార్పులకు అనుగుణంగా, ఇతర అత్యవసర పరిస్థితులను అంచనా వేస్తూ బడ్జెట్‌లో మార్పులు చేయడాన్ని చర లక్షణ బడ్జెట్ అంటారు.

**కుంటి బాతు బడ్జెట్** (Lame duck budget)

- దీన్ని సంవత్సరంలో కొంత కాలానికి మాత్రమే రూపొందిస్తారు. పరిపాలన పరంగా అనిశ్చిత పరిస్థితుల్లో దీన్ని తయారు చేస్తారు.

**జెండర్ బడ్జెట్** (Gender budget)

- లింగ వివక్షను తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా సంక్షేమ పథకాలు, కేటాయింపుల్లో స్త్రీలకు నిర్దిష్ట మొత్తంలో నిధులను రిజర్వు చేస్తూ ప్రవేశపెట్టే బడ్జెట్‌ను జెండర్ బడ్జెట్ అంటారు. ఈ రకమైన బడ్జెట్‌ను మొదటిసారి స్వీడన్‌లో ప్రవేశ పెట్టారు.

**లోటు బడ్జెట్ రకాలు**

1) రెవెన్యూ లోటు 2) బడ్జెట్ లోటు
3) కోశ లోటు 4) ప్రాథమిక లోటు
5) ద్రవ్యలోటు
6) వాస్తవిక రెవెన్యూ లోటు

**రెవెన్యూ లోటు:** ఈ లోటును 1950–51 నుంచి లెక్కిస్తున్నారు. రెవెన్యూ రాబడి కంటే రెవెన్యూ వ్యయం ఎక్కువగా ఉంటే రెవెన్యూ లోటు ఏర్పడుతుంది.

- రెవెన్యూ లోటు = రెవెన్యూ వ్యయం > రెవెన్యూ రాబడి
- రెవెన్యూలోటు = (ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయం – పన్ను, పన్నేతర రాబడి

**బడ్జెట్‌లోటు:** దీన్ని 1950–51 నుంచి గణిస్తున్నారు. మొత్తం రాబడి కంటే మొత్తం వ్యయం ఎక్కువగా ఉంటే దాన్ని బడ్జెట్ లోటు అంటారు.

- బడ్జెట్ లోటు = మొత్తం వ్యయం – మొత్తం రాబడులు
- బడ్జెట్ లోటు = (రెవెన్యూ మూలధన వ్యయాలు) – (రెవెన్యూ మూలధన రాబడులు)

**కోశలోటు:** సుఖమయ్ చక్రవర్తి కమిటీ సిఫారసుల మేరకు 1997–98 నుంచి గణిస్తున్నారు.

- బడ్జెట్ లోటుకు మార్కెట్ రుణాలు కలిపితే వచ్చేది కోశ లోటు.
- కోశలోటు = బడ్జెట్ లోటు + మార్కెట్ రుణాలు
- మూలధన రాబడులు మార్కెట్ రుణాల మధ్య ఉన్న తేడాను కోశ లోటు అంటారు.

**ప్రాథమిక లోటు:** కోశ లోటు వడ్డీ చెల్లింపులకు మధ్య ఉన్న తేడాను ప్రాథమిక లోటు అంటారు.

- ప్రాథమిక లోటు = కోశ లోటు – వడ్డీ చెల్లింపులు

**ద్రవ్యలోటు:** ఆర్థిక వ్యవస్థలో ఏర్పడిన లోటును నూతన కరెన్సీ ముద్రణ ద్వారా భర్తీ చేస్తే దాన్ని ద్రవ్యలోటు అంటారు.

- ద్రవ్యలోటు భర్తీ వ్యవస్థలో ద్రవ్య సప్లయ్‌ను పెంచుతుంది. ఇది ద్రవ్యోల్బణానికి అంటే ధరల పెరుగుదలకు దారి తీస్తుంది.

**వాస్తవ రెవెన్యూలోటు:** రెవెన్యూ లోటు నుంచి మూలధన ఆస్తులు సృష్టించే గ్రాంట్లను తీసివేస్తే వచ్చేదాన్ని వాస్తవిక రెవెన్యూ లోటు అంటారు.

- వాస్తవిక రెవెన్యూలోటు = రెవెన్యూలోటు – మూలధన ఆస్తులు సృష్టించే గ్రాంట్లు

**బడ్జెట్‌లో ఉండే అంశాలు**

**మొత్తం రాబడి:** రెవెన్యూ రాబడి, మూలధన రాబడిని కలిపి మొత్తం రాబడి అంటారు.

- రెవెన్యూ రాబడిలో పన్ను రాబడి, పన్నేతర రాబడులు ఉంటాయి.
- పన్ను రాబడిలో ప్రత్యక్ష, పరోక్ష పన్నులు ఉంటాయి.
- పన్నేతర రాబడులు వడ్డీల మీద వచ్చే రాబడి, జరిమానాలు, జప్తులు, గ్రాంట్ల ద్వారా వస్తాయి.
- మూలధన రాబడిలో ప్రభుత్వ రుణాలు, ప్రభుత్వ ఆస్తులు అమ్మడం వల్ల వచ్చే ఆదాయం

**మొత్తం వ్యయం:** మొత్తం వ్యయంలో రెవెన్యూ వ్యయం, మూలధన వ్యయం ఉంటాయి.

**రెవెన్యూ బడ్జెట్:** రెవెన్యూ వ్యయం, రెవెన్యూ రాబడి గురించి తెలియజేసేది రెవెన్యూ బడ్జెట్

**రెవెన్యూ వ్యయం:** రెవెన్యూ వ్యయం అంటే సాధారణ పరిపాలన కోసం చేసే వ్యయం ఉద్యోగులకు చెల్లించే జీతాలు, ప్రజల సంక్షేమం కోసం చేసే వ్యయం, పెన్షన్లు, స్కాలర్‌షిప్‌లు, వడ్డీ చెల్లింపులను రెవెన్యూ వ్యయం అంటారు.

**మూలధన వ్యయం:** ప్రభుత్వం తన ఆస్తులను పెంచుకోవడానికి చేసుకునే వ్యయం, పరిశ్రమలు ఏర్పాటు చేయడం, రోడ్ల నిర్మాణం, ప్రాజెక్టుల నిర్మాణం, విమానాశ్రయాల నిర్మాణం, ఓడరేవులు ఏర్పాటు చేయడం, విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేయడం, యంత్రాలను దిగుమతి చేసుకోవడాన్ని మూలధన వ్యయం అంటారు.

**మూలధన బడ్జెట్:** మూలధన రాబడి, మూలధన వ్యయం గురించి తెలియజేసేదాన్ని మూలధన బడ్జెట్ అంటారు.

- ప్రణాళిక వ్యయం, ప్రణాళికేతర వ్యయం మూలధన 1987–88 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రభుత్వ వ్యయాన్ని ప్రణాళిక వ్యయం, ప్రణాళికేతర వ్యయం అంటారు.

**ప్రణాళిక వ్యయం:** అభివృద్ధికి తోడ్పడే వ్యయాన్ని ప్రణాళిక వ్యయం అంటారు. ఈ వ్యయాన్ని తిరిగి రెవెన్యూ ప్రణాళిక వ్యయం, మూలధన ప్రణాళిక వ్యయం అని రెండు రకాలుగా వర్గీకరించారు.

- రెవెన్యూ ప్రణాళిక వ్యయంలోని అంశాలు **ఉదా:** వ్యవసాయం దాని అనుబంధ రంగాలు, పరిశ్రమలు, గనులు, రవాణా రంగం, కమ్యూనికేషన్స్, విద్యుత్ రంగం, నీటిపారుదల రంగం, సైన్స్ అండ్ టెక్నాలజీ, సాధారణ సేవలు, సాధారణ ఆర్థిక సేవలపై చేసే వ్యయం.
- రాబడి మూలధన ప్రణాళిక వ్యయంలోని అంశాలు **ఉదా:** రాష్ట్ర ప్రణాళికలకు చేసే వ్యయం, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రణాళికలకు చేసే వ్యయం.

**ప్రణాళికేతర వ్యయం:** ప్రభుత్వం చేసే అభివృద్ధేతర వ్యయాన్ని ప్రణాళికేతర వ్యయం అంటారు. ప్రణాళికేతర వ్యయాన్ని తిరిగి రెవెన్యూ ప్రణాళికేతర వ్యయం, మూలధన ప్రణాళికేతర వ్యయం అంటారు.

- రెవెన్యూ ప్రణాళికేతర వ్యయానికి **ఉదా:** దేశ రక్షణ వ్యయం, వడ్డీ చెల్లింపులు, జీతభత్యాలు, పింఛన్లు, సబ్సిడీలు, పరిపాలన వ్యయాలు
- రాబడి మూలధన ప్రణాళికేతర వ్యయానికి **ఉదా:** సామాజిక అభివృద్ధిపై చేసే వ్యయం, ప్రాజెక్టులపై చేసే వ్యయం.

## ఇతర అంశాలు

**లోటు ఆర్థిక బిల్లు:** కొత్త పన్నుల విధింపు ప్రస్తుత పన్ను వ్యవస్థలో సవరణలు లేదా గడువు తర్వాత కొనసాగింపులకు సంబంధించి ప్రభుత్వం చేసే ప్రతిపాదనల సారాంశం.

**ఆర్థిక బిల్లు:** ఆర్థిక బిల్లు ఒకేసారి ఒకే ఏడాదికి పార్లమెంటు ఆమోదిస్తుంది.

**ప్రభుత్వ రాబడి:** పౌరుల ఖర్చు కోసం, పరిపాలన కోసం, పౌరుల నుంచి గ్రహించిన మొత్తాన్ని ప్రభుత్వ రాబడి అంటారు.

**ప్రభుత్వ వ్యయం:** దేశ రక్షణ కోసం, శాంతి భద్రతల పరిరక్షణ కోసం, పౌర శ్రేయస్సును రక్షించడం కోసం, అభివృద్ధి చేయడానికి పెట్టిన ఖర్చులను ప్రభుత్వ వ్యయం అంటారు.

**మూలధన వ్యయం:** నీటిపారుదల ప్రాజెక్టులు, పరిశ్రమలు, విద్యుత్ ప్రాజెక్టులు, జాతీయ రహదారుల వంటి వాటికి నిర్మాణానికి అయ్యే వ్యయాన్ని మూలధన వ్యయం అంటారు.

**సెస్:** 270, 271 ఆర్టికల్స్ వివరణ తెలుపుతుంది. విద్య సెస్, ఆరోగ్య సెస్, స్వచ్ఛభారత్ సెస్. పన్నుపై పన్నును వసూలు చేయడాన్ని సెస్ అంటారు. విద్య, ఆరోగ్య సెస్ 4% విధిస్తున్నారు.

**సర్ చార్జీ:** ఒక నిర్దిష్టమైన ఆదాయం వచ్చే వారిపై విధించిన పన్నును సర్ చార్జీ అంటారు. రూ.5 కోట్ల ఆదాయం ఉన్న వారు 27% పన్ను చెల్లిస్తుంటే ప్రస్తుతం 25% తగ్గించారు. ఆదాయ పన్ను చెల్లించేవారు తిరిగి చెల్లించడాన్ని సర్ చార్జీ అంటారు. సెస్ పన్నుపై విధిస్తారు, ఆదాయంపై విధించరు. సెస్ పన్నును ఏ ఉద్దేశం కోసం వసూలు చేస్తున్నారో ఆ ఉద్దేశం కోసం ఖర్చు చేయాలి.

**సెస్ ప్రత్యక్ష పన్నులు, పరోక్ష పన్నుల మీద పడుతుంది.**

| | | |
|---|---|---|
| రెస్టారెంట్ బిల్లు | | రూ.1000 |
| జీఎస్టీ | (18%) | రూ. 180 |
| సెస్ | (10%) | రూ. 18 |
| మొత్తం | | రూ.1198 |